నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘ గుంటూరు జిల్లా శాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ మంగళవారం బీఆర్ స్టేడియం రోడ్డులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పి.పవన్‌కుమార్, కార్యదర్శి పి.అమ్మయ్య, సహాధ్యక్షుడు మెహబూబ్ బాషా, ఉపాధ్యక్షులు షఫీ అహ్మద్, బి.భాస్కర్, సంయుక్త కార్యదర్శి భరత్‌కుమార్, గోపీనాయక్, శామ్యూల్, కార్యనిర్వాహక కార్యదర్శి జీవీఆర్ శేషారావు పాల్గొన్నారు.

గుంటూరు అభివృద్ధికి కృషి చేద్దాం

లక్ష్మీపురం: గుంటూరు అభివృద్ధికి కృషి చేద్దామని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేట అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సమావేశం నిర్వహించారు. సంస్థ ఉపాధ్యక్షులు పి.ఎస్ మూర్తి మాట్లాడారు.

సీతారామయ్య స్కూల్లో నూతన సంవత్సర వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో మంగళవారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలక వర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్స్ జంపని పద్మజ, కర్లపూడి పార్వతీదేవి, సమన్వయకర్తలు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

బాలికను గర్భిణిని చేసిన మేనమామ

లక్ష్మీపురం: బాలికను మేనమామ గర్భిణిని చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నగరంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన 14 సంవత్సరాల బాలికను ఆమె సొంత మేనమామ ప్రేమపేరుతో నమ్మించి గర్భిణిని చేశాడు. నాలుగు రోజుల నుంచి బాలిక కడుపు నొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తీసుకు వెళ్లి పరీక్షలు చేయించారు. బాలిక 7 వారాల గర్భిణి అని నిర్ధారించారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేవీవీ క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: శాస్త్ర విజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞానవేదిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు బి.ప్రసాద్, జి.వెంకటరావు, ఎం.క్యూరీ, టి.చాందిని, టీఆర్ రమేష్, శివపూర్ణయ్య, జేవీవీ సుబ్బారాయుడు, జి. శాంతమూర్తి పాల్గొన్నారు.

కెనడీస్ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్ విద్యార్థుల సేవా నిరతి



గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్ 4వలైనులోని కెనడీస్ నెక్స్‌జెన్ కిడ్స్ పాఠశాలలో మంగళవారం నూతన సంవత్సరం సందర్భంగా క్రాఫ్టింగ్ ఫర్ ఏ కాజ్ పేరుతో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా నిరుపయోగమైన వస్తువులతో తయారు చేసిన పెన్‌స్టాండ్స్, అందమైన గృహోపకరణాలు, గాజులపెట్టె తదితర సామగ్రిని ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణ ద్వారా సేకరించిన ధనాన్ని బ్రాడీపేటలోని శ్రీషిరిడి సాయి దీన జనసేవాసమితిలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

కార్పొరేషన్‌లో గ'లీజు' వ్యవహారంపై సీరియస్

చెక్కులు ఎప్పుడు ఇచ్చారనే అంశంపై కమిషనర్ ఆరా..

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో చాలా వరకు లీజు గడువు పూర్తయ్యాయి. వీటిలో స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో రెన్యువల్ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేయడంతో రెవెన్యూ అధికారులు ఇదే అదునుగా రెన్యువల్స్ పేరుతో దోపిడీ తెర తీశారు. లీజుదారులు సకాలంలో చెక్కులు అందజేసినప్పటికి వాటిని సకాలంలో పోస్టింగ్ వేయకుండా షాపునకు సంబంధించి అద్దె, వడ్డీ లక్షల్లో పెరిగిపోయిందని చెప్పడం .. అంత ఇవ్వలేకుంటే మాకు కొంత ఇస్తే దానిని మాఫీ చేస్తామని లీజుదారులకు చెప్పడంతో లీజుదారులు చేసేదేమి లేక రెవెన్యూ సిబ్బందికి ముడుపులు ఇచ్చుకుని లీజుకు సంబంధించిన వడ్డీని మాఫీ చేస్తున్నారు. దీనిపై గత ఆదివారం 'సాక్షి'లో 'కార్పొరేషన్‌లో గ'లీజు' వ్యవహారం' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం నిర్వహించిన రెవెన్యూ మీటింగ్‌లో చెక్కుల పోస్టింగ్ వ్యవహారం, వడ్డీ మాఫీ వ్యవహారంపై సీరియస్ అయినట్లు సమాచారం. ఇందులో భాగంగా షాపు లీజుదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించడంతో, మంగళవారం కౌన్సిల్ సమావేశంలో లీజుదారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశమయ్యారు. మీరు చెక్కులు ఎప్పుడు ఇచ్చారు. ఎప్పుడు సర్దుబాటు చేశారు. వడ్డీ ఎంత పడింది అనే అంశాలను లీజుదారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో కొన్ని అవకతవకలు జరిగినట్లు తెలడంతో సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకునేందుకు కమిషనర్ సిద్ధమవుతుండడంతో రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



షాపింగ్ కాంప్లెక్స్ లీజుదారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూనగర్: నగరంలో తాగునీటి సరఫరాలో ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అనధికార నీటి విక్రయాలకు అడ్డుకట్ట వేయకుంటే చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ లాడ్జి సెంటర్‌లోని హెచ్ఎల్ఆర్ ట్యాంక్, ఎస్‌వీఎన్ కాలనీ, జేకేసీ కాలేజ్ రోడ్, శ్యామలా నగర తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత హెచ్ఎల్ఆర్‌లో నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి వస్తున్న నీరు, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాల రిజర్వాయర్లకు సరఫరాని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, ఇంటింటి చెత్త సేకరణ, గ్యాంగ్ వర్క్ ద్వారా డ్రెయిన్లు క్లీన్ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. శ్యామల నగర్‌లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్డు కొలతలు, ర్యాంప్‌లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణ నగర్‌లో మున్సిపల్ స్కూల్‌ని పరిశీలించి, స్కూల్ మరమ్మతుల వివరాలు తెలుసుకున్నారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వర రావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వర రావు, డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాసరావు, మధుసూదన్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలో గుంటూరు బార్ అసోసియేషన్, వైఎస్సార్ సీపీ మహిళా న్యాయవాదులు ముందస్తు నూతన సంవత్సర వేడుకలు మంగళవారం క్యాంటీన్ వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. సీనియర్ మహిళా న్యాయవాదులు మాట్లాడుతూ సోషల్ మీడియా కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలపై అనేక కేసులు నమోదు చేశారని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటామని చెప్పారు. వారిని న్యాయపరంగా ఆదుకుంటామని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజా పరిపాలన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుంటామని అన్నారు. జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనం ఐదు వేల నుంచి పది వేలకు పెంచుతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి ఆరు నెలలు గడిచినా ఫలితం లేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు జూనియర్ న్యాయ వాదులకు ఉపకార వేతనాల కింద ఐదు వేలు చొప్పున ప్రతినెలా అందించారని గుర్తుచేశారు. బార్ కౌన్సిల్‌కు సంబంధించి రూ.100 కోట్లు మంజూరు చేశారని, అయితే చంద్రబాబు నెలలు దాటినా న్యాయవాదులకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. అబద్ధాల సీఎంగా త్వరలో చంద్రబాబు నిలిచిపోతారని అన్నారు. న్యాయవాదులు పుష్ప, వాణి, మాధవి, మంజుల, ఝాన్సీ, శ్యామల, వరదాయిని, విజయ, సోనీ, వెంకటరమణ, ప్రసన్నలక్ష్మి, తిరుపతమ్మ, డయానా పాల్గొన్నారు.



కుల గణన జాబితాల సవరణ గడువు పొడిగింపు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కుల గణన జాబితాలో సవరణలకు జనవరి 7వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పూర్తయిన కుల గణన జాబితాలను ఈ నెల 26న నగరంలోని 206 వార్డు సచివాలయాల నోటీసు బోర్డుల్లో సందర్శనార్థం ప్రకటించడం జరిగిందన్నారు. నగర ప్రజలు సర్వే రిపోర్ట్‌లోని తమ వివరాలు సరిగా ఉన్నాయో, లేదో చెక్ చేసుకోవచ్చని తెలిపారు. పేర్లు, సబ్ క్యాస్ట్ కేటగిరి వివరాలు తప్పుగా ఉన్నా లేదా ఏమైనా అభ్యంతరాలు ఉన్నా డిసెంబర్ 31వ తేదీలోగా అర్జీలు అందజేయవచ్చని ప్రభుత్వం గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రజలకు మరింత గడువు ఇచ్చేందుకు జనవరి 7వ వరకు గడువు పెంచడం జరిగిందన్నారు. 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా స్థానిక సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శి, వీఆర్ఓలకు లిఖిత పూర్వకంగా అర్జీలు అందించవచ్చని తెలిపారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో విచారించి, విచారణ మేరకు తుది జాబితాలో నమోదు చేస్తామన్నారు.

బీజేపీ నాలుగో మండల అధ్యక్షుడిగా తిరుమలరావు

గుంటూరు మెడికల్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బీజేపీ నాలుగో మండల అధ్యక్షుడిగా వక్కలగడ్డ తిరుమలరావును ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక అరండల్‌పేట 6వలైనులోని కార్యాలయంలో మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన తిరుమలరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెరుకూరి తిరుపతి రావు పాల్గొన్నారు.

షిప్ ఫౌండేషన్‌కు సహాయ, సహకారాలు అందిస్తాం

– డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు రూరల్: షిప్ ఫౌండేషన్‌లో ఉన్న హెచ్ఐవీ పేషెంట్లకు హోప్ విన్ హాస్పిటల్స్‌లో ఉచిత ఓపీ ద్వారా సేవలు అందిస్తామని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమా సుల్తానా తెలిపారు. మంగళవారం అమరావతిరోడ్డు గోరంట్ల హోసన్న మందిరం సమీపంలోని సొసైటీ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ హెచ్ఐవి ఇన్ఫెక్టెడ్ పీపుల్ (షిప్) ఫౌండేషన్‌లో ఉన్న 250 మంది హెచ్ఐవీ పేషంట్లకు బట్టలు, బెడ్ షీట్స్, భోజనం హోప్ విన్ హాస్పిటల్స్, సలాం నమస్తే గుంటూరు సొసైటీ (ఎన్జీఓ) ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సుమారు 6 వేల మంది పేషెంట్లను అక్కున చేర్చుకున్న షిప్ ఫౌండేషన్ నిర్వాహకులను ఆమె అభినందించారు. హెచ్ఐవీ బాధితులకు విశేష సేవలందిస్తున్న షిప్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రమాదేవిని డాక్టర్ షమా సుల్తానా మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కె.విజయలక్ష్మి, బాజీ బి, శ్రీదేవి పాల్గొన్నారు.



లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ఎమినీటి కార్యదర్శులు లబ్ధిదారులతో జియో ట్యాగ్ చేయించడంలో ప్రత్యేక చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎమినీటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. తొలుత లే అవుట్స్ వారీగా ఇళ్ల నిర్మాణం ఏ మేరకు పూర్తయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను లే అవుట్ల వారీగా ఎమినిటి కార్యదర్శులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ లే అవుట్స్‌లో నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల వారీగా ఇచ్చిన టైం లైన్ మేరకు జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు ఇచ్చిన టైం లైన్ మేరకు పనులు పూర్తి చేయాలని కోరారు. నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్‌కు తగిన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. సొంతంగా నిర్మాణం చేసుకునే వారు త్వరగా చేసుకునేలా ఎమినీటి కార్యదర్శులు తోడ్పాటుని అందించాలన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వాటికి సంబంధించి బిల్లుల ఆన్‌లైన్ ఎమినీటి కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేయాలని, జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్. ఓబులేసు, హౌసింగ్ పీడీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, హౌసింగ్ ఈఈ శంకర రావు, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

లక్ష్మీపురం: చండీఘర్ విద్యుత్ డిస్కం, ఉత్తరప్రదేశ్ విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన బాట పట్టిన ఉద్యోగ, కార్మికులకు సంఘీభావంగా గుంటూరు నగరంలో సంగడిగుంట విద్యుత్ భవన్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అదానితో కుదుర్చుకున్న అన్ని రకాల విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా చండీఘర్‌లో విద్యుత్ ప్రైవేట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నారన్నారు. లాభాల బాటలో నడుస్తున్న డిస్కంను ప్రైవేటీకరణకు యత్నిస్తుందని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. విద్యుత్ డిస్కం ఆస్తులు మొత్తం అప్పజెప్పకపోతే ప్రైవేటీకరిస్తామన్న ఆదేశాలు వెనక్కి తీసుకోపోతే జనవరి ఒకటి నుంచి నిరవధిక సమ్మెకు దిగ్గబోతున్నారని వారికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పేరుతో ప్రైవేటీకరణ విధానాలు అమలు జరుపుతున్నారని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెడితే వాటిని పగలగొట్టమని గతంలో లోకేష్ ఆదేశాలు జారీ చేశారని మరి ఇప్పుడు వాడవాడలా బిగిస్తుంటే వాటిపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. అదానీతో కుదుర్చుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాంప్రభాకర్, చెన్నకేశవులు, ఎం.చిష్టీ, షేక్ ఖాసిం వలి, షేక్ మస్తాన్ వలీ, చింతల శ్రీనివాసరావు, కె.రాంబాబు, ప్రజాసంఘాల నాయకులు వై. కృష్ణకాంత్, ఏ యశ్వంత్, నాగరాజు, శ్రీనివాసరావు, రాణి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పోరాటాలకు సిద్ధం కండి

లక్ష్మీపురం: భారతదేశ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి, లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు నగర శివారు భూపోరాట కేంద్రం చంద్ర రాజేశ్వరరావు నగర్‌లో మంగళవారం నిర్వహించిన సీపీఐ శత వార్షికోత్సవ సభకు సీఆర్ నగర్ సీపీఐ కన్వీనర్ ఎస్.దేవా నాయక్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను సైతం వారు అవమానిస్తున్నారని మండిపడ్డారు. సభలో పార్టీ నగర కార్యవర్గ సభ్యులు మంగా శ్రీనివాసరావు, నాయకులు కూరాకుల రాంప్రసాద్, బత్తుల శ్రీనివాసరావు, హుస్సేన్ బి, నక్షత్ర, మౌలాలి, కరిముల్లా, మస్తాన్, మట్టి శీను పాల్గొన్నారు.

ప్రజాపోరాటాల సంవత్సరంగా –2025

లక్ష్మీపురం: ప్రజా పోరాటాల సంవత్సరంగా 2025వ సంవత్సరాన్ని ప్రకటిస్తున్నట్లు సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తెలిపారు. స్థానిక కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. 2024 కు వీడ్కోలు పలుకుతూ 2025 కు స్వాగతం పలుకుతూ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, నాయకులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, బందెల నాజర్ జి, జంగాల చైతన్య పాల్గొన్నారు.